సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం, 22, జూన్, 2023



ఇద్దరి అరెస్ట్
తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని చిట్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. - 4లో



జయశంకర్‌కు నివాళి
ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి ఈ సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. - 5లో

గరిష్టం/కనిష్టం
38° / 26°


వాతావరణం
పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం వచ్చే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ అత్యవసర సమావేశం

భువనగిరి టౌన్: ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు జెడ్పీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన తెలంగాణ అమరవీరు కుటుంబాలకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎజెండా అంశాలైన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి 2 నిమిషాలు మౌనం పాటించుట, అమరుల సంస్మరణ తీర్మానంతోపాటు ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

యాదాద్రీశుడికి సంప్రదాయ పూజలు



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందెతీర్థం, ఆరాధన గావించారు. భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం, నిత్య కల్యాణం, తిరువీధి జోడు సేవలను నిర్వహించారు. రాత్రి పవళింపు సేవను నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. పూజలతో శ్రీస్వామివారికి నిత్యాదాయం రూ.15,16,345 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

వైభవంగా ఆధ్యాత్మిక జ్ఞానయజ్ఞ సప్తాహం



ప్రవచిస్తున్న చైతన్యానంద స్వామిజీ

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞ సప్తాహం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ జగద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానంద స్వామిజీ హాజరై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం సామూహిక శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగం వ్యవస్థాపక అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి, అధ్యక్షుడు బల్ల దుర్వాసులు, ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణ, దోర్నాల వెంకటేష్, సీత శ్రీరాములు, సకినాల నాగయ్య, తడక ఆంజనేయులు, కటకం నరహరి, మాచర్ల కృష్ణానంద, పుప్పాల నాగేశ్వర్, భోగ నర్సింహ, మాకం నరేందర్, రవ్వ లక్ష్మయ్య, మహేశ్వరం ప్రసాద్, ఆడెపు బాలకృష్ణ, రుద్ర అక్షయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధిగా రవిచంద్ర



రామన్నపేట: టీపీసీసీ అధి కార ప్రతినిధిగా రామన్నపేట మండలం ఉత్తటూ రుకు చెందిన మేడి రవిచంద్ర నియామకమయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవిచంద్ర ఎన్ఎస్‌యూఐ, యూత్‌కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ న్యాయవాదిగా పని చేస్తున్నారు.

కొత్తవారికీ 'రైతుబంధు'కు అవకాశం

యాదగిరిగుట్ట రూరల్: నూతనంగా భూమి పాస్ పుస్తకాలు వచ్చిన రైతులకు కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం 2023–24 సీజన్‌కు సంబంధించి రైతుబంధు అమలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకుని జూన్ 16 వరకు పాస్ పుస్తకం పొందిన రైతులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 26వ తేదీ నుంచి రైతుబంధు డబ్బులు తమ ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ముఖ్యంగా పట్టా పాస్‌బుక్ (లేదా) తహసీల్దార్ డిజిటల్ సైన్ చేసిన ఆఫీస్ కాపీ, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంటు (సేవింగ్స్ ఖాతా) జిరాక్స్ కాపీలను తీసుకుని దరఖాస్తు ఫామ్‌ను నింపి, వ్యవసాయ విస్తరణ అధికారికి ఇవ్వాలని పేర్కొన్నారు. ఇది వరకు రైతు బంధు డబ్బులు పడిన రైతులు మళ్లీ జిరాక్స్‌లు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఒక వేళ ఎవరైనా తమ అకౌంటును మార్చుకోవాలంటే, వీలైనంత త్వరగా వ్యవసాయ అధికారికి కలిసి మార్పులు చేసుకోవాలని సూచించారు.

గోదారమ్మ రాకకు..

శరవేగంగా 'కాళేశ్వరం'-15 కుడి డిస్ట్రిబ్యూటరీ నిర్మాణం



రాజాపేట మండలం కొండ్రెడ్డిచెర్వు గ్రామ సమీపంలో కొనసాగుతున్న కాలువ పనులు

- రాజాపేట మండలంలో 5 కిలోమీటర్ల మేర పూర్తికావొచ్చిన పనులు
- వచ్చే ఏడాదిలోగా సాగు జలాలు అందించాలని లక్ష్యం

రాజాపేట: ఆలేరు నియోజకవర్గంలోని కరువు పీడిత మండలాలకు సాగు జలాలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి తుర్కపల్లి మండలం వరకు 15వ ప్యాకేజి ప్రధాన కాలువకు అనుబంధంగా చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ పనులు రాజాపేట మండలంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం నుంచి మొదలై జిల్లాలోని తుర్కపల్లి మండలం ముల్కలపల్లి వద్దకు ప్రధాన కాలువ నిర్మాణం జరుగుతుంది. దీంట్లో భాగంగా తుర్కపల్లి నుంచి రాజాపేట మండలానికి గోదావరి జలాలకు అందించే లక్ష్యంగా 36.5 కిలోమీటర్ల పొడవు కుడి డిస్ట్రిబ్యూటరీ నిర్మాణం చేపట్టారు. అయితే గత రెండు నెలల క్రితం పనులు ప్రారంభం కాగా మధ్యలో నిలిచిపోయాయి. మరలా నిధులు విడుల కావడంతో వారం రోజులుగా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే 5 కిలోమీటర్ల మేర గ్రావిటీ కాలువ పనులు పూర్తికావొచ్చాయి.

8,474 ఎకరాలకు సాగునీరందే అవకాశం

15వ ప్యాకేజి ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయితే తుర్కపల్లి, రాజాపేట మండలాలలోని 8,474 ఎకరాల ఆయకట్టు సాగులోకి రానుంది. అయితే తుర్కపల్లి నుంచి నిర్మాణ చేపట్టిన కుడి డిస్ట్రిబ్యూటరీ నిర్మాణం జరిగితే ఒక్క రాజాపేట మండలంలో 6,400 ఎకరాలకు గోదావరి జలాలు అందనున్నాయని అధికారులు అంటున్నారు. దీంతోపాటు ఈ కాలువ ద్వారా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలోని రామోజీకుంట, రాజాపేట మండలం నర్సాపూర్‌లోని మైసమ్మకుంట, చెలాయికుంట, తిరుమలకుంట, మల్లగూడెంలోని మల్లెచెరువు, పాముకుంటలోని వెంకటాద్రి చెరువు, జాల గ్రామంలోని జాల చెరువు, కుర్రారంలోని పాత చెరువులను గోదావరి జలాలతో నింపుతారు.

రూ.12.42 కోట్ల నిధులు విడుదల

రాజాపేట, తుర్కపల్లి మండలాకు సాగుజలాలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న 15వ ప్యాకేజీ ప్రధాన కాలువలో భాగంగా చేపట్టిన డిస్ట్రిబ్యూటరీ కుడి కాలువ నిర్మాణానికి ఇప్పటికే 154.13 ఎకరాల భూమి సేకరించగా 92 ఎకరాల భూమికి నష్టపరిహారం డబ్బులు చెల్లించారు. మిగతా రైతులకు చెక్కులు రాసి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.12.42 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ డిస్ట్రిబ్యూటరీ నిర్మాణానికి మొత్తం 132 మంది రైతుల నుంచి 189 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.12.42 కోట్లు కేటాయించింది. వచ్చే వానాకాలంలోగా రాజాపేట మండల రైతాంగానికి గోదావరి జలాలు అందించాలనే లక్ష్యంతో అధికారులు పనులు చేయిస్తున్నారు.

ఇంకా నష్టపరిహారం రాలేదు



మాకున్న 2 ఎకరాల భూమిలో కాలువ పనుల కోసం 10గుంటల భూమి నష్టపోతున్నాం. మా భూమి మధ్య నుంచి కాలువ పోతుండటంతో భూమి ఎటూ కాకుండా పోయింది. ఈ భూమి మా అమ్మ రాములమ్మ పేరున ఉంది. నష్టపరిహారం కోసం అన్ని వివరాలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఎలాంటి పరిహారం చెల్లించలేదు. త్వరగా చెల్లించాలి.

– కర్రె మల్లేశం, రైతు, కొండ్రెడ్డిచెర్వు

కాలువ నిర్మాణంతో ఆనందంగా ఉంది



మా గ్రామానికి 15వ ప్యాకేజీ డిస్ట్రిబ్యూటరీ ద్వారా గోదావరి జలాలు వస్తాయంటే రైతులకు ఎంతో ఆనందంగా ఉంది. ఇన్ని సంవత్సరాలుగా వర్షంపైనే ఆధారపడి పంటలు సేద్యం చేసేవాళ్లం. 500 నుంచి 1000 ఫీట్ల బోర్ల వేసినా ఫలితం లేకుండాపోయేది. కెనాల్‌తో భూగర్భ జలాలు అధికమై సాగు విస్తీర్ణం కూడా పెరుగుతుంది.

– రెడ్డబోయిన రాజు, రైతు, మల్లగూడెం

వచ్చే వానాకాలం సీజన్‌లోగా గోదావరి జలాలు



సీఎం కేసీఆర్ పాలనలో కొండ పోచమ్మ సాగర్, నృసింహసాగర్ ప్రాజెక్టుల ద్వారా తుర్కపల్లి, బొమ్మల రామారం, యాదగిరిగుట్టకు సమృద్ధిగా సాగు జలాలు అందిస్తున్నాం. 15వ ప్యాకేజీ ప్రధాన డిస్ట్రిబ్యూటరీ నిర్మాణానికి రూ.12.42 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీన్ని త్వరగా పూర్తిచేసి రాజాపేట మండలానికి వచ్చే వానాకాలం సీజన్‌లోగా గోదావరి జలాలు అందిస్తాము. భూ సేకరణకు రైతులు సహకరించాలి.

– గొంగిడి సునీత, ప్రభుత్వ విప్

యోగా సాధనతో సంపూర్ణారోగ్యం



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో యోగా సాధనలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి



భువనగిరి కోర్టు ఆవరణలో యోగా సాధన చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి తదితరులు

- కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి: నిత్య యోగా సాధనతో ప్రతిఒక్కరూ సంపూర్ణారోగ్యంతో గడపవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన ప్రపంచ యోగా దినోత్సవానికి ఆమె హాజరై మాట్లాడారు. యోగాతో మానసిక, శారీరక ప్రశాంతం లభిస్తుందన్నారు. దైనందిన జీవితంలో ఒత్తిడిని జయించాలంటే యోగా సాధన తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీసీహెచ్ఎస్ చిన్న నాయక్, డాక్టర్ వినోద్, అనిల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని, యశోద, ప్రోగ్రాం అధికారి సుమన్ కళ్యాణ్, గీత, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో..

భువనగిరి జిల్లా కోర్టు ఆవరణంలో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు హాజరై యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.మారుతిదేవి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె మురళిమోహన్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగారం అంజయ్య పాల్గొన్నారు.

చేనేత సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- చేనేత జౌళిశాఖ రీజినల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటేశం



కార్మికులకు బీమా బాండ్‌లు అందజేస్తున్న చేనేత జౌళి శాఖ అధికారి వెంకటేశం

చౌటుప్పల్: చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చేనేత జౌళిశాఖ రీజినల్ డెవలప్‌మెంట్ అధికారి వెంకటేశం తెలిపారు. మండలంలోని నేలపట్ల గ్రామంలోని చేనేత సంఘంలో బుధవారం డీసీసీబీ మాజీ డైరెక్టర్, స్థానిక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నాయి, వాటి పరిష్కారానికి మార్గాలు వంటి అంశాలపై చర్చించారు. ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన అంశాలను రాష్ట్ర చేనేత శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు బీమాబాండ్లు అందజేశారు. ఈ సదస్సులో చేనేత జౌళిశాఖ జిల్లా ఏడీ కె.విద్యాసాగర్, డీఓ ప్రసాద్, రాష్ట్ర కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ చత్రపతి, ప్రతినిధులు రామచంద్రం, తడక కోటేశ్వర్, గుర్రం శ్రీనివాస్, నర్సింహ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

- ఆధ్యాత్మిక సంబురం



దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం యాదాద్రిలో నిర్వహించిన ఆధ్యాత్మిక దినోత్సవంలో చిరుధాన్యాల లడ్డూ ప్రసాదం అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



బ్యాటరీ వాహనంలో యాదాద్రి కొండపై పర్యటిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, విప్ సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

అంగన్‌వాడీ గుడ్లకు ప్రత్యేక ముద్ర

- కేంద్రాల నుంచి పక్కదారి పట్టకుండా చర్యలు
- జూలై 1నుంచి ముద్ర వేసినవి సరఫరా చేయనున్న ప్రభుత్వం



భువనగిరి టౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నెలనెలా కోడి గుడ్లు, ఇతర పౌష్టికాహార సరుకులు పంపిణీ చేస్తుంది. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే కోడి గుడ్లు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు తరుచూ వస్తున్నాయి. అలాగే కుళ్లిన, చిన్న పరిమాణం కలిగిన గుడ్లు సరఫరా చేస్తుండటంతో చెత్త పాలవుతున్నాయి. ఈ క్రమంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి కోడిగుడ్డుపై అంగన్‌వాడీ గుడ్డు అని ముద్రించనున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ కొన్ని జిల్లాల్లో ప్రారంభం కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో జూలై 1 నుంచి ప్రారంభం కానుంది.

నెలలో రెండు విడతలుగా..

జిల్లాలో భువనగిరి, ఆలేరు, మోత్కూరు, రామన్నపేటతో కలిసి నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 844 ప్రధాన కేంద్రాలు, 57 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 17,785 మంది చిన్నారులు, 5,322 గర్భిణులు, 5,055 బాలితలు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు రోజుకు ఒకటి చొప్పున, ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు 16 చొప్పున ఉడికించిన గుడ్లు ఇస్తున్నారు. 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు రోజుకు ఒక ఉడక బెట్టిన గుడ్డు చొప్పున నెలకు 30 ఇస్తారు. అయితే ఇక జూలై ఒకటినుంచి కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్డు– తెలంగాణ ప్రభుత్వం' అన్న ముద్ర వేయనున్నారు. నెలలో పక్షం రోజుల పాటు సరఫరా చేసే మొదటి విడత గుడ్లు నీలి రంగు, రెండో విడత ఎరుపు రంగుల్లో ఉండనున్నాయి. ఈ గుడ్లు నల్లబజారుకు తరలిస్తే అధికారులు గుర్తుపట్టే అవకాశం ఉంది. గుడ్లు పక్కదారి పట్టించినా, ఇతరులు కొనుగోలు చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్ వాటిని శుభ్రంచేసి ముద్ర వేయాలి. కేంద్రాలపై జిల్లా సంక్షేమాధికారిణి, సీడీపీఓలు, సూపర్వైజర్లు పర్యవేక్షణ ఉంటుంది.

జూలై నుంచి అమలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే గుడ్లను జూలై నుంచి ముద్ర వేసినవి పంపిణీ చేయనున్నాం. గుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ప్రతి గుడ్డుపై ముద్ర వేస్తున్నారు. బరువు తక్కువగా ఉన్న, ముద్రలేని గుడ్లను తీసుకోవద్దని ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం.

– రేఖల స్వరాజ్యం, భువనగిరి సీడీపీఓ

జూలైలో న్యాక్ బృందం సందర్శన

రామగిరి(నల్లగొండ): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపులో భాగంగా జూలై నెలలో నల్లగొండలోని అంబేద్కర్ స్టడీ సెంటర్‌కు న్యాక్ బృందం రానున్నట్లు యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.ధర్మానాయక్, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ స్టడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. న్యాక్ సందర్శన ఉన్నందున స్టడీ సెంటర్ కౌన్సిలర్లు, పూర్వ విద్యార్థులు అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం జిల్లాలో స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

8 పోస్టులు.. 377 దరఖాస్తులు

- జిల్లా సంక్షేమ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు యమ డిమాండ్
- అప్పుడే పైరవీలకు తెరలేపిన దరఖాస్తుదారులు
- ఉద్యోగం ఇప్పిస్తామని రేటు మాట్లాడుకుంటున్న దళారులు!



సాక్షి, యాదాద్రి: జిల్లా సంక్షేమ శాఖలో చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించనున్న ఉద్యోగాలకు డిమాండ్ ఏర్పడింది. ప్రాజెక్టు కోఆర్డినేటర్ 1, కౌన్సిలర్ 1, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజర్ పోస్టులు 3, కేస్ వర్కర్ 3 పోస్టుల భర్తీకి సంబంధించి ఆ శాఖ అధికారులు ఈనెల 5న దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానించారు. ఈ నెల 17వ తేది వరకు 377 దరఖాస్తులు వచ్చాయి. అంచనాలకు మించి వచ్చిన దరఖాస్తులను జిల్లా సంక్షేమ అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 30లోపు అర్హులను నియమిస్తామని అధికారులు చెబుతున్నారు.

జోరందుకున్న పైరవీలు

తెలంగాణ ఎంప్లాయ్‌మెంట్ అసిస్టెంట్ మిషన్ (టిమ్) ద్వారా నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కావడం నెలసరి జీతం రూ.20వేలకు పైగా ఉండడంతో దరఖాస్తు చేసుకున్న వారు అన్ని అర్హతలు ఉన్నా, లేకున్నా ఎలాగైన ఉద్యోగం దక్కించుకోవాలన్న ఆశతో ఇప్పటికే పైరవీలకు తెరలేపారు. అయితే నిరుద్యోగులు ఉద్యోగం కోసం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో కింది స్థాయి ప్రజా ప్రతినిధులు తెస్తున్న పైరవీలను కాదనలేక ఎమ్మెల్యేలు కొంత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తమ వారికి సిఫారసు చేస్తే మిగతావారు ఎక్కడ దూరం అవుతారోనన్న ఆందోళన వారిలో ఉంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆ శాఖకు సంబంధించిన కొందరు అధికారులు, ఉద్యోగులు రంగంలోకి దిగినట్లు సమాచారం. ఉద్యోగానికో రేటు నిర్ణయించి మరీ చెబుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో పైరవీలకు తావు లేకుండా ప్రతిభ అధారంగా చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు.

సీఎం కేసీఆర్ వల్లే ధూపదీప నైవేద్యాలు

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి: సీఎం కేసీఆర్ చేస్తున్న కృషితోనే నేడు దేవాలయాలు ధూప, దీప నైవేద్యాలకు నోచుకుంటున్నాయని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని శ్రీపచ్చలకట్ట సోమేశ్వరాలయం వద్ద ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మరుగున పడిన దేవాలయాల అభివృద్ధికి నిధులను కేటాయించి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, జెడ్పీసీఈఓ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, ఆలయ కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.



శివలింగానికి మొక్కుతున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని ధనలక్ష్మి ఫంక్షన్‌హాలులో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్, పట్టణ కోర్‌కమిటీ కన్వీనర్ భారత లవకుమార్, కె.రఘుమారెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, కాసుల అంజయ్య, సర్పంచ్ చిన్నలచ్చి లింగస్వామి, తోట శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, చింతల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

భువనగిరి టౌన్: వేముల మహేందర్ ఆశయాల సాధనలో భాగంగా మతోన్మాద వ్యతిరేక పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరిలోని సుందరయ్య భవనంలో మహేందర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నర్సింహ, పాండు, యాదగిరి, సైదులు, వెంకటేష్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రాములమ్మ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా

రెండు స్కూల్ బస్సులు సీజ్



వలిగొండలో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ సురేందర్ రెడ్డి

వలిగొండ : వలిగొండ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన రెండు బస్సులను బుధవారం భువనగిరి రవాణా శాఖ అధికారి సురేందర్‌రెడ్డి సీజ్ చేశారు. బుధవారం వలిగొండలో తనిఖీలు చేపట్టగా ఓ పాఠశాలకు చెందిన రెండు బస్సులకు సరైన ధ్రువపత్రాలు లేక పోవడంతో సీజ్ చేసి, వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

పెన్‌పహాడ్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని మొర్సకుంట తండాకు చెందిన ధరావత్ శంకర్ (55) మంగళవారం పనుల నిమిత్తం పెన్‌పహాడ్ గ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మాచారం గ్రామ శివారులోని రైస్ మిల్లు వద్ద వెనక నుంచి బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని తొలుత సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ధరావత్ భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి : రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి మండల పరిధిలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మాయిపల్లి–నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 35 సంవత్సరాల వయసున్న మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. లేత ఆకుపచ్చ ప్యాంటు, యాష్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఒకరికి తీవ్ర గాయాలు

నకిరేకల్ : నకిరేకల్‌లోని కడపర్తి బైపాస్ రోడ్డులో బుధవారం ట్రాక్టర్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట మండలం సోలిపేట గ్రామానికి చెందిన అమ్మడి వెంకన్న తన కారులో నకిరేకల్ వైపునకు వస్తుండగా జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వెంకన్నను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

● 'పేట'లో ఆధ్యాత్మిక శోభ



తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ ప్రభుత్వ క్షేమాన్ని కాంక్షిస్తూ సూర్యాపేటలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డితో కలిసి పూజలు, ప్రార్థనలు చేస్తున్న అర్చకులు, ముస్లింలు, క్రైస్తవులు

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

● బంగారు, వెండి ఆభరణాలతో పాటు కారు, పలు వస్తువులు స్వాధీనం



చిట్యాల : మాట్లాడుతున్న సీఐ శివరాంరెడ్డి

చిట్యాల: తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. చిట్యాలలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డితో కలిసి నార్కట్‌పల్లి సీఐ శివరాంరెడ్డి నిందితుల వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటూ పంక్చర్ దుకాణం నిర్వహించే మహ్మమద్ అబ్రారుద్దీన్ అలియాస్ అబ్రర్, అలియాస్ చోటిభునియా, హైదరాబాద్‌లోని మొఘల్‌పురాలో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేసే షేక్ ఇర్ఫాన్ మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డారు. వీరిద్దరూ ఈజీగా డబ్బులు సంపాదించేందుకు తాళాలు వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన సొత్తును విక్రయించగా వచ్చిన డబ్బులతో గోవా, ముంబాయి వంటి దూర ప్రాంతాలకు వెళ్లి జల్సాలు చేశారు. ఇలా వరుసగా చోరీలకు పాల్పడుతుండటంతో వీరిపై పోలీసులు పీడీ యాక్ట్‌ను నమోదు చేసి ఏడాది పాటు జైలుకు పంపారు. అనంతరం వీరిద్దరూ ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు.

తాళాలు వేసిన ఇళ్లలో..

ఈ క్రమంలో వీరిద్దరు వాహనంలో ప్రయాణిస్తూ తాళం వేసి ఇంట్లో దొంగతనాలు పాల్పడుతున్నారు. ఇలా వీరు 65 జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ ఈ నెల 5న రాత్రి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలోని తాళం వేసి ఉన్న పొట్లపల్లి శ్రీధర్‌గౌడ్, ఆ పక్కనే ఉన్న వాళ్ల అమ్మ వాళ్ల ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు, నగదు, టీవీ, రెండు సిలిండర్‌లను ఎత్తుకెళ్లారు. కాగా బాధితులు చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీఎస్ పోలీసులు, క్లూస్ టీం ద్వారా దొంగల ఆచూకీ తెలుసుకుని హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ఐదున్నర తులాల బంగారు నక్లెస్, ఆరున్నర తులాల వెండి గిన్నె, గ్లాస్, స్పూన్, ఎల్‌జీ కంపెనీకి చెందిన స్మార్ట్ టీవీ, రెండు హెచ్‌పీ గ్యాస్ సిలిండర్‌లు, రైస్ కుక్కర్, స్టీల్ కాష్ బాక్స్, స్టీల్ బేసిన్, రెండు స్మార్ట్ ఫోన్లు, రెండు కత్తులు, కారు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

● సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

మఠంపల్లి: తెలంగాణ–ఆంధ్రా పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి 2023 చివరలో సాధారణ ఎన్నికలు జరుగనున్నందున ఎన్నికల నియమావళి పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రెండు రాష్ట్రాల పోలీసు అధికారులకు మట్టపల్లిలోని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సమన్వయ సమావేశం నిర్వహించారు. చెక్‌పోస్టుల ఏర్పాటు, నిర్వహణ, తనిఖీలు, కేసుల నమోదు, గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యం, నల్లబెల్లం, పటిక రవాణా, నకిలీ విత్తనాల నిరోధం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్లు ప్రశాంతంగా స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అసాంఘిక శక్తులు అవరోధాలు కలిగించకుండా రక్షణ కల్పించడానికి కృషిచేయాలన్నారు. అనుకూల, ప్రతికూల పరిస్థితులు అధిగమించడానికి ప్రణాళిక ప్రకారం అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఇరురాష్ట్రాల సరిహద్దు అధికారులు ఒకరికొకరు సమాచారం చేరవేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. సమావేశంలో కోదాడ, మిర్యాలగూడ డీఎస్పీలు వెంకటేశ్వరరెడ్డి, వెంకటగిరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నందిగామ, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు జనార్దననాయుడు, ఆదినారాయణ, అప్పలరాజు, డీసీఆర్‌బీ సీఐ నర్సింహ, జిల్లా స్పెషల్‌బ్రాంచ్ సీఐ శ్రీనివాస్, స్థానిక సీఐ రామలింగారెడ్డి, మఠంపల్లి ఎస్ఐ సీహెచ్‌బాలకృష్ణ, రెండు రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

● మృతుడి బైక్‌లోంచి రూ.1.50లక్షల నగదు గల బ్యాగ్ మాయం?



లింగయ్య(ఫైల్)

త్రిపురారం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. త్రిపురారం మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చందంపేట మండలంలోని తెల్‌దేవర్‌పల్లి గ్రామానికి చెందిన మేడవోని లింగయ్య (35) పని నిమిత్తం బైక్‌పై హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్నాడు. ఇదే క్రమంలో త్రిపురారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న హెచ్‌పీ బంక్‌లో పెట్రోల్ పోసుకొని రోడ్డు పైకి వస్తున్నాడు. ఈ క్రమంలో హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో బైక్ మీద వెళ్తున్న లింగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఢీకొట్టిన కారులోని వ్యక్తులు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడు లింగయ్య త్రిపురారంలో ట్రాక్టర్ ట్రాలీ కొనుగోలు చేసేందుకు రూ.1.50లక్షల నగదుతో వచ్చాడని బంధువులు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే దుండగులు నగదు గల బ్యాగ్‌ను అపహరించుకుపోయారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గేదెలను ఢీకొట్టిన ఇంటర్‌సిటీ

● కొండ్రపోల్ వద్ద నాలుగు గంటల పాటు నిలిపివేత

మిర్యాలగూడ : రైల్వే ట్రాక్‌పై ఉన్న గేదెలను ఢీకొట్టిన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి సుమారు నాలుగు గంటల పాటు నిలిచింది. విజయవాడ నుంచి లింగంపల్లికి వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి 9గంటలకు నల్లగొండ జిల్లా బొత్తలపాలెం వద్దకు చేరుకోగానే ట్రాక్‌పై వెళ్తున్న గేదెలను ఢీకొట్టింది. ఈ సంఘటనలో రైలు ఇంజన్ పైపు పగలడంతో సాంకేతిక సమస్య ఏర్పడగా సమీపంలోని కొండ్రపోలు స్టేషన్ వరకు తీసుకువచ్చి రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టినప్పటికీ బాగుకాలేదు. దీంతో అర్ధరాత్రి ఒంటిగంట తరువాత అధికారులు మిర్యాలగూడ నుంచి గూడ్స్‌రైలుకు సంబంధించిన ఇంజన్‌ను తీసుకొచ్చి మరమ్మతులు చేపట్టడంతో రైలు బయలుదేరింది. సుమారు నాలుగు గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

మిర్యాలగూడ అర్బన్: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ బాలిక పట్ల సీతారాంపురానికి చెందిన ఎస్‌కె.జావెద్ కొద్ది రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ నెల 16న రాత్రి సమయంలోనూ బాలికను వేధించాడు. సదరు బాలిక విషయం తల్లికి విషయం చెప్పింది. దీంతో ఆమె టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందుతుడిపై పోక్సో చట్టం కిదం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా 13రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. నిందితుడిని నల్లగొండ జైలుకు పంపినట్లు టుటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజా రాజీనామా



సూర్యాపేటలో అభివాదం చేస్తున్న పెద్దిరెడ్డి రాజా తదితర నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పెదిరెడ్డి రాజా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బుధవారం జిల్లా కేంద్రంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శనగాని రాంబాబు గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మోదుగు నాగిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భాష పంగు భాస్కర్, నేరెళ్ల మధు గౌడ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతామన్నారు. సూర్యాపేటలో ఎవరికి టికెట్ వచ్చినా గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి కళ్యాణ్, సాజిద్ ఖాన్, మాజీ కౌన్సిలర్ కొండగడుపుల సూరయ్య, మాజీ సర్పంచ్ దున్న బాబు, గోపగాని గిరి గౌడ్, రాపర్తి వెంకటేశం, సురేష్‌గౌడ్, రాచకొండ దేవయ్య, ధరావత్ దస్రు, ఎలుగూరి రవి, వెంకన్న, గుణగంటి మధు, కొండా రాజేష్, సలిగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లబెల్లం పౌడర్, పటిక స్వాధీనం



పట్టుకున్న నల్లబెల్లం, పటికతో ఎక్సైజ్ పోలీసులు

దేవరకొండ: నిషేధిత సారా తయారీకి వినియోగించే నల్లబెల్లం పౌడర్, పటికను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మహారాష్ట్ర లాతూర్ నుంచి డీసీఎం వాహనంలో నల్లబెల్లం పౌడర్‌ను తరలిస్తున్నారన్న సమాచారంతో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీం, దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం ఉదయం కొండమల్లేపల్లి మండల పరిధిలోని నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై గల శేరిపల్లి గేట్ వద్ద రూట్ వాచ్ నిర్వహించారు. ఈ క్రమంలో డీసీఎం వాహనంలో 220బస్తాల్లో తరలిస్తున్న 6,600కేజీల నల్లబెల్లం పౌడర్, 50కేజీల పటికను పట్టుకున్నట్లు తెలిపారు. వీటిని దేవరకొండతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాకు సరఫరా చేసేందుకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకోవడంతో పాటు రమావత్ నరేష్, నేనావత్ లాలు, అశోక్‌లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎస్టీఎఫ్ సీఐ మోహన్‌బాబు, ఎస్ఐలు ఆదిశేషురెడ్డి, రవికుమార్, సూర్యప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

ఉరేసుకుని యువ రైతు బలవన్మరణం



వినయ్‌రెడ్డి(ఫైల్)

చిట్యాల: ఉన్నత చదువులు చదివి వ్యవసాయం చేస్తున్న ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. చిట్యాల మండలం బొంగోనిచెర్వు గ్రామానికి చెందిన వెలిమినేటి వినయ్‌రెడ్డి(24) హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి రెండేళ్ల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. అనంతరం తనకున్న పదమూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన వ్యవసాయ పొలంలోని కొట్టం వద్ద చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వినయ్ తండ్రి ఎనిమిదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అవివాహితుడైన వినయ్‌రెడ్డి తల్లి మంగమ్మతో పాటు నాయనమ్మ, వివాహమైన అక్క ఉంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పంచనామా చేశారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో..

కేతేపల్లి: కుటుంబ కలహాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కేతేపల్లికి చెందిన పసల జయరాజు (60) కూతురు వివాహం చేసుకుని భర్తతో కలసి న్యూజిలాండ్‌లో స్థిరపడింది. జయరాజు కూతురు ఇటీవల ప్రసవించటంతో ఆమెకు తోడుగా ఉండేందుకు జయరాజు భార్య అక్కడికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటుంది. ఈవిషయమై తరుచూ దంపతులు గొడవపడుతున్నారు. ఈనేపథ్యంలో జయరాజు భార్య మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లింది. మనస్తాపం చెందిన జయరాజు ఇంట్లో ఎవరూ లేకపోవటంతో అదేరోజు మధ్యాహ్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌కు వెళ్లిన భార్య జయరాజు సెల్‌కు ఫోన్ చేసినా ఎంతకూ తీయలేదు. ఆందోళన చెందిన ఆమె చుట్టు పక్కల నివాస గృహాల వారికి ఫోన్ చేసి విషయం చెప్పింది. వారు వెళ్లి చూసే సరికి జయరాజు ఇంట్లో దూలానికి వేలాడుతూ కన్పించాడు. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఆరోగ్యమ్మ బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

తూము షట్టర్లు చోరీ చేశారని ఫిర్యాదు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలంలోని ముల్కలకాలువ మేజర్ ఉట్లపల్లి క్రాస్ వద్ద నుంచి రాయినిపాలెం గ్రామం వరకు ఉన్న తూముల షట్టర్లను దుండగులు అపహరించుకుపోయారని ఇరిగేషన్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ విజయలక్ష్మి బుధవారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామం నుంచి ముల్కలకాలువ గ్రామం వరకు ముల్కలకాలువ మేజర్ 19.591 కిలో మీటర్ల పొడవు ఉంటుందని తెలిపారు. ఉట్లపల్లి క్రాసింగ్ వద్ద 4.653 కిలో మీటర్ల నుంచి రాయినిపాలెం గ్రామం వరకు 16.500 కిలో మీటర్లు వరకు ఉన్న తూము షట్టర్లు, 16గేర్ బాక్స్‌లు, షట్టరును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పేర్కొన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాలి

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత డ్రైవర్లపైనే ఉందని ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం నల్లగొండ డిపోలో డ్రైవర్లకు చైన్నైకి చెందిన చోళ ఎంఎస్‌రిస్క్ సర్వీసెస్ సంస్థతో నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాసం, నైపుణ్య శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులకు భద్రత భరోసా కల్పించేందుకు మరింత కృషి చేయాలని.. అందుకు డ్రైవర్ల పాత్ర కీలకమని చెప్పారు. ప్రయాణికుల ప్రాణాలు, వారి కుటుంబ భవిష్యత్ అంతా డ్రైవర్ల చేతిలో ఉంటుందన్నారు. ఏకాగ్రతతో వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ శ్రీనివాస్, మురళికృష్ణ, డిప్యూటీ ఆర్ఎం శివశంకర్ పాల్గొన్నారు.

నీటిపై యోగాసనం



చిట్యాల మండలం శివనేనిగూడెంలోని బావిలో నీటిపై యోగాసనం వేసిన ఇంటర్ విద్యార్థిని కన్నెబోయిన సిరిచందన

గరిడేపల్లిలో వరికొయ్యలకు నిప్పు

● మంటలంటుకుని మద్యం దుకాణం దగ్ధం

గరిడేపల్లి : గుర్తుతెలియని వ్యక్తులు వరికొయ్యలకు నిప్పుపెట్టగా.. ఆ మంటలు వ్యాపించి మద్యం దుకాణం దగ్ధమైంది. గరిడేపల్లి మండల కేంద్రంలో కోదాడ–జడ్చర్ల రహదారి పక్కన పొలాలకు సమీపంలో లక్ష్మీనర్సింహస్వామి మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. పంట పొలాలకు సంబంధించిన రైతులు వరికొయ్యలకు నిప్పు అంటించడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించి మద్యం దుకాణానికి అంటుకున్నాయి. దీంతో ఆ దుకాణానికి సంబంధించిన సిట్టింగ్ రూమ్ కూడా దగ్ధం అయిందని, సుమారు 20లక్షల పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు తండు ప్రసాద్ వాపోయాడు. పొలాల్లోని కొయ్యలకు నిప్పు పెట్టడం వలనే మంటలు వ్యాపించి పర్మిట్ రూమ్‌కు వేసిన తాటాకుల గుడిసెకు మంటలు అంటుకున్నాయని తెలిపాడు. దాని పక్కనే ఉన్న కిచెన్ రూమ్‌లో ఉన్న సిలిండర్ పేలిందని, దీంతో మంటలు మరింత ఎగిసిపడ్డాయన్నాడు. 20లక్షలకు పైగా మద్యం దగ్ధమైందన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. గరిడేపల్లి ఎస్ఐ వెంకట్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలం వద్ద చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

తిరుమలగిరి: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తొండ గ్రామంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు విద్యుత్‌లైన్లు బ్రేక్‌డౌన్ అయ్యాయి. లైన్‌మన్ వ్యక్తిగత సహాయకుడు మహేష్ గ్రామానికి ఒక బిట్ కట్ చేసి సింగిల్ ఫేస్ లైన్ విద్యుత్ సరఫరా చేసి వెళ్లాడు. బుధవారం ఉదయం రైతులు త్రీ ఫేస్‌లైన్ కోసం లైన్‌మన్‌ను సంప్రదించగా మరలా మహేష్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ వద్ద ఎల్‌సీ తీసుకుని బ్రేక్‌డౌన్‌కు గల కారణాలు వెతుకుతున్నాడు. ఈ క్రమంలో స్తంభం ఎక్కిన సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురైన మహేష్ ఆ స్తంభంపైనే వేలాడాడు. అక్కడే ఉన్న అతని మిత్రుడు సతీష్ వెళ్లి కర్ర సహాయంతో మహేష్‌ను కింద పడవేశాడు. దీంతో మహేష్ చేతులు కాళ్లకు తీవ్ర గాయలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు.

ఆలయంలో చోరీ

నూతనకల్ : నూతన్‌కల్ మండల పరిధిలోని వెంకెపల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని దొంగిలించుకుపోయారు. ఉదయం పూజారి ఆలయానికి రావడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

APGVB ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (APGVB) రీజనల్ ఆఫీస్, నల్లగొండ.

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ తెలుపబడిన మా శాఖల యందు ఖాతాదారులు బంగారు ఆభరణములు తాకట్టు పెట్టి ఋణములు పొందియున్నారు. అట్టి ఋణం మొత్తం సకాలంలో చెల్లించవలసిందిగా నోటీసులు పంపియున్నాము. గడువులోగా ఋణం చెల్లించని కారణంగా తనఖా పెట్టిన బంగారు ఆభరణములను "ఎక్కడ ఎలాగ ఉన్నది అలాగే" అనే ప్రాతిపదికపై ఈ క్రింద తెలియజేసిన శాఖలలో 1) **అగామోత్కూరు, వేములపల్లి, నిడమనూర్, త్రిపురారం, అడవల్లి, దామరచర్ల శాఖలకు** సంబంధించిన ఆభరణములను **మిర్యాలగూడెం క్లస్టర్ బ్రాంచ్‌లో**, 2) **నకిరేకల్, టి.పి.రోడ్ నకిరేకల్, తుంగతుర్తి శాఖలకు** సంబంధించిన ఆభరణములను **నకిరేకల్ క్లస్టర్ బ్రాంచ్‌లో**, 3) **నాంపల్లి శాఖకు** సంబంధించిన ఆభరణములను **నాంపల్లి క్లస్టర్ బ్రాంచ్‌లో**, 4) **విజయపురి నార్త్ శాఖకు** సంబంధించిన ఆభరణములను **విజయపురి నార్త్ క్లస్టర్ బ్రాంచ్‌లో** ది. 30-06-2023 (శుక్రవారం) సా।। 5-00 గం।।లకు వేలం నిర్వహించబడును.

క్రమ సంఖ్య	అకౌంట్ నెం.	ఋణగ్రహీత పేరు, తండ్రి / భర్త పేరు, చిరునామా	బరువు గ్రాములలో
		అగామోత్కూర్ శాఖ	
1.	73189585730	కంచర్లకుంట్ల లక్ష్మీ, భర్త: రాంరెడ్డి, కొయ్యలపహాడ్, గుర్రప్పగూడెం.	27.5
		నిడమనూర్ శాఖ	
1.	73189376781	బొల్లేపల్లి లక్ష్మమ్మ, భర్త: బక్కయ్య, గోపువారిగూడెం.	28.73
2.	73189384158	బొల్లేపల్లి లక్ష్మమ్మ, భర్త: బక్కయ్య, గోపువారిగూడెం.	24.91
3.	73189570109	చంద్రమ్మ అనుమల, భర్త: చిన్న బిక్షం, నిడమనూర్.	14.98
		త్రిపురారం శాఖ	
1.	73189355285	రొండా వెంకన్న, తండ్రి: పాపయ్య, అన్నారం.	24.49
		నకిరేకల్ శాఖ	
1.	73189875838	విమలమ్మ కందికంటి, భర్త: రాములు, ఎస్.సి.కాలనీ, మంగళపల్లి.	25.63
		విజయపురి నార్త్ శాఖ	
1.	73189382923	రమావత్ రాములు, తండ్రి: నక్క, వై.సి.తండా.	19.7
2.	73188831369	మేదరి అంజలి, భర్త: నాగయ్య, హైలాన్ కాలనీ.	30.5
		తుంగతుర్తి శాఖ	
1.	73189896665	దుబ్బాక అశోక్, తండ్రి: ముత్తయ్య, సంగెం.	16.7
2.	73189933631	మల్లెపాక చంటి, తండ్రి: భిక్షం, కె.కొత్తగూడెం.	15.1
3.	73189670749	కొమ్ము కృష్ణ, తండ్రి: మల్లయ్య, కె.కొత్తగూడెం.	19.7
		అడవల్లి శాఖ	
1.	73188774137	పనుగోతు రాంసింగ్, తండ్రి: మంగ్లా, ఇందిరానగర్.	27.92
2.	73188916221	మిట్టగడపాల రుఖాన్సీ, భర్త: ప్రకాష్, కాల్వకట్ట.	25.4
		టి.పి.రోడ్ నకిరేకల్ శాఖ	
1.	73189405250	మొగిలి నాగమణి, భర్త: వెంకన్న, 3-22, నకిరేకల్, నల్లగొండ.	23.95
		నాంపల్లి శాఖ	
1.	73189942852	గిరి రామాంజమ్మ, భర్త: రాములు, చిట్టెంపాడు, నాంపల్లి, నల్లగొండ.	11.05
		వేములపల్లి శాఖ	
1.	73189796343	చిలకల లింగమ్మ, భర్త: నర్సయ్య, రాయినిపాలెం, మిర్యాలగూడ.	14.15
		దామరచర్ల శాఖ	
1.	73188136445	ధరావత్ అమర్‌సింగ్ నాయక్, తండ్రి: అప్పారావునాయక్, నర్సాపూర్, దామరచర్ల.	43.23
2.	73188581850	రావుల అంజమ్మ, భర్త: పుల్లయ్య, దామరచర్ల.	4.49
3.	73189247622	షేక్ సుభానీబీ, భర్త: షరీఫా, దామరచర్ల.	42.96

వేలం నియమ నిబంధనలు :
1) వేలం APGVB పైన తెలిపిన క్లస్టర్ శాఖలలో జరుపబడును. 2. వేలంలో పాల్గొనదలచినవారు రూ।। 10,000/- సెక్యూరిటీ డిపాజిట్ చేయవలెను. 3. పోటీదారు డబ్బు మొత్తం వెంటనే చెల్లించి ఆభరణములు తీసుకొనవలెను. 4. ఆభరణములు వేలం సమయములో మాత్రమే తనిఖీ చేసుకొనవలెను. 5. సరియైన విలువ రానిచో లేదా ఏ కారణము లేకుండా వేలం రద్దు చేయుటకు బ్రాంచి మేనేజర్‌కు అధికారం కలదు. మిగతా వివరాలకు ఆయా శాఖల బ్రాంచి మేనేజర్‌ను సంప్రదించగలరు.

ఇట్లు – **రీజనల్ మేనేజర్,** APGVB **రీజనల్ ఆఫీస్, నల్గొండ.**